ప్రజాశక్తి

సోమవారం 2 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అవకాశమిస్తే..

అన్ని రంగాల్లో మహిళలు రాణింపు

ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అవకాశాలు ఇస్తే మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తారని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం గ్రీటింగ్ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా లోకానికి ఐద్వా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తోందన్నారు. గ్రీటింగ్ కార్డుపై 'ఆధునిక స్త్రీ చరిత్రను పునర్లిఖిస్తుంది - గురజాడ, ప్రతి వంట గత్తె ఒక రాజకీయ వేత్త కావాలి - లెనిన్, చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే చట్టం చెయ్యాలి' అని ముద్రించినట్టు తెలిపారు. సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 150 సంవత్సరాల క్రితం చెప్పినట్లుగా మహిళలు అవకాశాలిస్తే అన్ని రంగాల్లో దూసుకు పోతారన్నారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు రాజకీయాల్లోకి రావాలని లెనిన్ కూడా 150 సంవత్సరాల క్రితమే పేర్కొన్నారన్నారు. ఆ రకంగా రాజకీయాల్లోకి కూడా మహిళలు వచ్చారని, చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి విజయాలు సాధించిన చరిత్ర మహిళా లోకానికి ఉందన్నారు. కానీ మనువాదులు మహిళలను వంటింటికి పరిమితం చెయ్యాలని, పిల్లలను కనే యంత్రంలా మార్చాలనే తిరోగమన భావజాలం తీసుకువస్తున్నారన్నారు. అందుకే ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ గోడలకు వేలాడుతూనే ఉందని ఆవేదన వెలిబుచ్చారు. పురుషాధిక్యత అడుగడుగునా ఆటంకపరుస్తుందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వెంటనే బిల్లును ఆమోదించి చట్టం చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, స్టీల్‌జోన్ కార్యదర్శి కె.వేణు, నాయకులు డి.వాణి, సుభాషిణి, విజయలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

ఐద్వా నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డును ఆవిష్కరిస్తున్న పుణ్యవతి

శ్రీ వాత్సవ్ రాజకీయ భవిష్యత్తు ఎలా ?

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కొనసాగుతున్న చర్చ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎంతో పట్టు ఉన్న ద్రోణంరాజు కుటుంబీకుల మూడో తరం నాయకుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ రాజకీయ భవిష్యత్తుపై నేడు చర్చ సాగుతోంది. దీనికి కారణం ఇటీవల శ్రీవాత్సవ్ తన తల్లి, భార్యలతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలవడం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉండే తను రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆ ఉద్యోగానికి రాజీనామా చేశానని, తన తండ్రి కీర్తిశేషులు ద్రోణంరాజు శ్రీనివాసరావు వారసునిగా తనకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్‌ను శ్రీవాత్సవ్ కోరినట్లు వార్తలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ ఉచ్ఛ దశలో ఉన్నప్పుడు ద్రోణంరాజు సత్యనారాయణ ఉత్తరాంధ్రలో ఆ పార్టీకి పెద్దదిక్కుగా ఉండేవారు. రాజ్యసభ సభ్యునిగా, పార్లమెంట్ సభ్యునిగా, ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పలు పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. ఉత్తరాంధ్రలో అనేక మందిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి, వారిని నాయకులుగా తీర్చిదిద్దిన గుర్తింపు ఉంది. ఆయన మృతి తరువాత 2006లో విశాఖ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాసరావు పోటీ చేసి గెలుపొందారు. అదే నియోజకవర్గం నుంచి 2009లో కూడా ఆయన గెలుపొందారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన 2019 ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి జగన్ పిలుపుమేరకు వైసిపిలో చేరారు. అదే ఏడాది విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేసి కేవలం మూడు వేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఆయనప్పటికీ శ్రీనివాస్‌ను గుర్తించి విఎంఆర్‌డిఎ ఛైర్మన్‌గా నామినేటెడ్ పదవి ఇచ్చి జగన్ గౌరవించారు. అయితే అనూహ్యంగా 2020లో కరోనాతో ఆయన మరణించారు. దీంతో అతని కుమారుడు శ్రీవాత్సవ్ తండ్రి వారసునిగా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకొని, తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇది జరిగి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా శ్రీవాత్సవ్‌కు వైసిపిలో తగిన గుర్తింపు లభించలేదు. అనూహ్యంగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న వాసుపల్లి గణేష్ కుమార్ టిడిపిని వీడి వైసిపిలో చేరారు. గణేష్ కుమార్ వైసిపిని ఆశ్రయించడంతో ఈ నియోజకవర్గ నుంచి శాసనసభకు పోటీ చేయాలని భావించిన శ్రీవాత్సవ్ ఆశలకు గండి పడినట్లు అయింది. అయినప్పటికీ మిగతా 2లో..

ఇటీవల సిఎంను కలిసిన శ్రీవాత్సవ్ కుటుంబీకులు

'ఉక్కు' పోరాటాన్ని ఆపేది లేదు

▶ వార్త మెయిన్‌లో..

బిజెపి సీనియర్ నేత పివి.చలపతిరావు మృతి

▶ వార్త మెయిన్‌లో..

63వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

▶ వార్త 2లో..

కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న మల్లికార్జున

రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి

- నూతన సంవత్సర వేళ విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున
- డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు నెల జీతం విరాళం

వార్త 2వ పేజీలో..

పండగ ప్రత్యేక బస్సుల్లోనూ..

సాధారణ ఛార్జీలే..

- **ఈ ఏడాది 550 ప్రత్యేక బస్సులు**
- **ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు**

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మరి కొద్ది రోజుల్లో అందరూ ఎదురు చూసే పెద్ద పండగ సంక్రాంతి మన ముందుకు రాబోతుంది. పెద్ద పండగ అంటే వారం రోజుల ముందు నుంచే ప్రయాణాలు, దూర ప్రాంతాల నుంచి రాకపోకల సందడి ఎలా ఉంటుందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే బోగి, సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా ముందూ, వెనకా మూడు రోజుల చొప్పున బస్సుల రద్దీ అంతా ఇంతా కాదు. స్పెషల్స్ వేస్తేగానీ ప్రయాణికుల అవసరాలు తీర్చగలిగే పరిస్థితి లేదు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి డబుల్, త్రిబుల్ ఛార్జీలు వంటి సమస్యలు తలెత్తవని, సాధారణ రోజుల్లోని ఛార్జీలనే వసూలు చేస్తామని ఆర్‌టిసి విశాఖ జిల్లా రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ప్రత్యేక బస్సు సర్వీసుల వివరాలనూ వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఈ సంవత్సరం పండగకు ప్రత్యేకత ఏమిటి ?

ప్రత్యేక బస్సులకు ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయకపోవడమే ప్రత్యేకత. మామూలు రోజుల్లో ఎంత ఛార్జీ అయితే గమ్య స్థానాలకు ప్రయాణికులు చెల్లిస్తున్నారో పండగ సందర్భంగానూ అవే ఛార్జీలను వసూలు చేయాలని నిర్ణయించాం. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పాలసీ అమలవుతోంది.

ఎన్ని బస్సులు వేశారు ?

ఈ ఏడాది 550 బస్సులను వివిధ దూర ప్రాంతాలకు వేశాం. గత ఏడాది 492 బస్సులు నడిపాం. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్, ఇచ్ఛాపురం, భీమవరం, పాలకొండ, పార్వతీపురం, రాజమండ్రి, రాజాం, రాజోలు, సాలూరు, శ్రీకాకుళం, విజయవాడ, విజయ నగరం, సోంపేట వంటి చోట్లకు ఈ స్పెషల్ బస్సులు నిత్యం తిరుగుతాయి.

అత్యధిక రద్దీ ఎక్కడకు ఉంటుంది ?

విజయవాడ, హైదరాబాద్, శ్రీకాకుళానికి రద్దీ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సాధారణ ఛార్జీలే..

ఉంటుంది. విజయవాడకు గత ఏడాది 53 బస్సులు నడిపితే ఈసారి 65 నడుపుతున్నాం. శ్రీకాకుళంకు కూడా ఇంతే. గత ఏడాది 73కాగా ఈ సంవత్సరం 75 నడుపుతున్నాం. విజయనగరానికి గత సంవత్సరం 19కాగా ఒక్కటి మాత్రమే పెంచాం.

ఆదాయ ఆర్జన ఎలా ఉంటుంది ?

గత ఏడాది 2 లక్షల 22 వేల కిలోమీటర్లు బస్సులను ఈ పండగ సందర్భంగా తిప్పడం ద్వారా రూ.87.35 లక్షల ఆదాయం సమకూర్చుకోవడం జరిగింది. మామూలు రోజుల్లో రోజుకు 3.32 లక్షల కిలోమీటర్లమేర 3.4 లక్షల మంది విశాఖ జిల్లాలో ప్రయాణాలు సాగిస్తున్నారు. రోజుకు ఆదాయం సుమారు రూ.కోటి వరకూ సమకూరుతోంది. కరోనా తర్వాత తగ్గిపోతున్న ఆదాయాన్ని నెమ్మదిగా ఆర్‌టిసి సంపాదించుకునే పనిలో నిమగ్నమైంది. కార్గో రెవెన్యూపైనా దృష్టిసారించాం. ఆర్‌టిసి కార్గో ద్వారా రోజుకు రూ.3 లక్షలకుపైగా ఆదాయం సముపార్జిస్తున్నాం. పండగ రద్దీ వేళల్లోనూ ఈ ఏడాది ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి.

శ్రీ వాత్సవ్ రాజకీయ భవిష్యత్తు ఎలా ?

శ్రీవాత్సవ్ వైసిపిలోనే కొనసాగుతూ ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. ఎమ్మెల్యేగా కాకపోయినా కనీసం శాసనమండలి సభ్యునిగానైనా అవకాశం వస్తుందని ఆయన భావించారు. అదీ కాకపోతే గుర్తింపు కలిగిన నామినేటెడ్ పదవి దక్కుతుందని ఆశిద్దారు. ఇంతవరకూ ఏ పదవీ ఆయనకు దక్కలేదు. ద్రోణంరాజు శ్రీనివాసరావు చనిపోయిన తర్వాత జరిగిన సంతాప సభలో రాజ్యసభ సభ్యుడు, వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి వి.విజయ్ సాయిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ శ్రీనివాసరావు వారసునిగా శ్రీవాత్సవ్‌కు తగిన గుర్తింపు ఇచ్చే పదవిని ఇవ్వటం జరుగుతుందని ప్రకటించారు. అది నేటి వరకూ నెరవేరలేదు. ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చిన మేరకైనా శ్రీవాత్సవ్‌కు ఏదైనా పదవి లభిస్తుందని అతని అనుచరులు భావిస్తున్నారు.

సింహాచలంను సత్కరిస్తున్న సిఐటియు నాయకులు

సింహాచలంకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఐటియు ఆధ్వర్యంలో డైమండ్ పార్క్ దగ్గర మొట్ట కళాసీ కొల్లి సింహాచలాన్ని ఆదివారం సన్మానించారు. ముఠా వర్కర్ల హక్కుల కోసం 32 సంవత్సరాలుగా ఆయన ఉద్యమించారని, అనేక సమస్యలపై పోరాడి విజయం సాధించారని, యూనియన్‌ను బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు పాల్గొన్నారు

జెడ్‌పిలో 11 మందికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కరోనా సమయంలో ఉద్యోగాల్లో ఉంటూ కరోనా బారినపడి మరణించిన వారి కుటుంబ సభ్యులు 11 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ ఆదివారం జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియామక పత్రాలు పొందిన వారంతా తక్షణం విధుల్లో చేరాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, పనిచేస్తున్న సంస్థకు మంచి పేరు తేవాలని కోరారు. కరోనా కష్టకాలంలో తల్లిదండ్రులను కోల్పోయిన వారికి త్వరితగతిన ఆసరా కల్పించాలని ప్రభుత్వం భావించి నియామక చర్యలు చేపట్టిందన్నారు. నియామకాలు పొందిన వారిలో ఒకరు టైపిస్టుగా, మిగిలిన పది మంది ఆఫీసు సబార్డినేట్లుగా ఉన్నారు.

63వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎనిమిది గ్రామాలకు చెందిన నేవీ నిర్వాసితులు వాడనర్సాపురం సమీపంలో ఎన్‌ఎఓబి గేటు ముందు చేస్తున్న ఆందోళన ఆదివారానికి 63వ రోజుకు చేరుకుంది. గతంలో అధికారులు ఇచ్చిన హామీలను, తమతో చేసుకున్న ఒప్పందాలను అమలుచేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. రెండు నెలల నుంచి తామంతా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమపై ఎటువంటి దయా కలగలేదన్నారు.

బివిఎఫ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పేద బాలలకు బాల వికాస ఫౌండేషన్ (బివిఎఫ్) అందిస్తున్న సేవలు అభినందనీయమని పారిశ్రామికవేత్త భరణికాన రామారావు అన్నారు. ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డులోగల బాల వికాస ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్‌లో ఆదివారం నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి

నూతన సంవత్సర వేళ విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున
డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు నెల జీతం విరాళం

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నూతన సంవత్సరంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 2023 నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజలు సహకారం అందిస్తున్నారని, ఇదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. నూతన సంవత్సరం వేళ జిల్లా ప్రజలందరికీ సంతోషాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ ఉన్నారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేశారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

విరాళాల వెల్లువ

నిరుపేదలు, నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసిన సంజీవని నిధి, డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ఆదివారం విరాళాలు వెల్లువెత్తాయి. డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు జిల్లా కలెక్టర్ మల్లికార్జున తన ఒక నెల జీతం రూ.లక్షా 10 వేలను చెక్కు రూపంలో విరాళంగా అందించారు. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ఉద్యోగులు రూ.12,500ను డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చారు. రెవెన్యూ, వియంఆర్‌డిఎ తదితర 29 శాఖలకు చెందిన ఉద్యోగులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి చెక్కుల రూపంలో రూ.9 లక్షల 82 వేల 998ను విరాళాలుగా అందించారు. నూతన సంవత్సరం రోజునే రూ.10 లక్షల 92 వేల 998 డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు అందాయి.

విరాళ చెక్కును డబ్బాలో వేస్తున్న కలెక్టర్

సిఐటియు రాష్ట్ర మహాసభకు పయనం

భీమవరం బయలుదేరిన విశాఖ జిల్లా ప్రతినిధులు

విశాఖపట్నం : భీమవరంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకూ జరుగనున్న సిఐటియు రాష్ట్ర 16వ మహాసభలో పాల్గొనేందుకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి సంఘం ప్రతినిధులు ఆదివారం రాత్రి విశాఖ, అనకాపల్లి ప్రాంతాల నుంచి రైళ్లలో బయలుదేరారు. సంఘం ఆయా జిల్లాల నాయకులు ఆర్‌కెఎస్‌వి. కుమార్, జి.కోటేశ్వరరావు తదితరులు మహాసభకు వెళ్లిన వారిలో ఉన్నారు. కార్మికుల సమస్యలపై మహాసభలో చర్చ జరిపి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు.

రాష్ట్ర మహాసభకు తరలివెళ్తున్న అనకాపల్లి జిల్లా ప్రతినిధులు

కూరగాయల పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బూరాడ సత్య నారాయణ పాత్రుడు జ్ఞాపకార్థం పేదలకు కూరగాయల పంపిణీ చేశారు. దక్షిణ నియోజకవర్గంలోని 39వ వార్డు కోటవీధిలో ఆదివారం ట్రస్టు ఛైర్మన్ పిళ్లా వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బూరాడ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు బివి. ప్రసాద్, లక్ష్మి, నీలిమ, రాజు, బూరాడ శ్రీనివాస్ పాత్రుడు, కె.మోహన్‌రావు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE, AT : VISAKHAPATNAM
O.S. 40/2020
Between :
Sri Munasa Gangadhar and others ...Plaintiffs
And
Sri Kona Rama Mohan Rao and 6 others ...Defendants
SUMMONS
To,
D-1: Sri Kona Rama Mohan Rao, S/o. late Gurunaidu, Hindu, aged 68 years, R/at D.No.44-41-3A, Nandagiri Nagar,Visakhapatnam-16.
Please take notice that the above named plaintiffs has instituted the above suit against you and the suit stands posted to **06-01-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **06-01-2023 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
R.V.K. NAIDU,
Advocate
Lalitha Colny, Dabagardens,
Visakhapatnam
Cell: 9849121168.

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE, AT : ANAKAPALLI
I.A. 794/2022 in O.S. 28/2022
Between :
Jajula Satya Rao & 4 others ...Petitioners/Plaintiffs
And
Jajula Appa Rao & 9 others ...Respondents/Defendants
NOTICE
To,
R-3: Jajula Satya Rao, S/o. Late J. Adhiyya, aged about 67 years, R/at D.No. 55-1-326/1, Flat No.4, SVR Nilayam, Desapatruni palem, Paravada Mandal, Visakhapatnam-531021. (earlier Visakhapatnam Dist) Now Anakapalli District.
R-4: Jajula Balaji, S/o. J. Satya Rao, aged about 35 years, Rest-do-.
Please take notice that the above named petitioners/plaintiffs has instituted the above I.A. against both of you and the I.A stands posted to **05-01-2023** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-01-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the petition will be heard and determined in your absence, exparte as per law.
M.V. JAGANNADHA RAO,
V. SOMASEKHARA RAO &
V. SUBRAHMANYESWARA RAO
Advocates,
Visakhapatnam,

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE, AT : ANAKAPALLI
O.S. 28/2022
Between :
Jajula Satya Rao & 4 others ...Plaintiffs
And
Jajula Appa Rao & 9 others ...Defendants
SUMMONS
To,
D-3: Jajula Satya Rao, S/o. Late J. Adhiyya, aged about 67 years, R/ at D.No. 55-1-326/1, Flat No.4, SVR Nilayam,Desapatrunipalem, Paravada Mandal, Visakhapatnam-531021. (earlier Visakhapatnam Dist) Now Anakapalli District.
D-4: Jajula Balaji, S/o. J. Satya Rao,aged about 35 years, Rest-do-.
Please take notice that the above named plaintiffs has instituted the above suit against both of you and the suit stands posted to **05-01-2023** for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-01-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
M.V. JAGANNADHA RAO,
V. SOMASEKHARA RAO &
V. SUBRAHMANYESWARA RAO
Advocates,
Visakhapatnam,

ఎడ్యుకేషన్ డే

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ విద్యాసంస్థ ఆధ్వర్యాన ఆదివారం ఎడ్యుకేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రొఫెసర్ పి.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులు తయారుచేసిన చీరలు, వస్తువుల ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దయాల్‌బాగ్ ఇనిస్టిట్యూట్‌లో అనేక వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టారన్నారు. వృత్తి విద్యా కోర్సుల ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. మరిన్ని వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించి యువతకు, మహిళలకు అండగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దక్షిణామూర్తి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-గాజువాక : ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (1992-93) సంవత్సరములో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యారు. పాఠశాలలో విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యను బోధించిన ఉపాధ్యాయుల గురించి చర్చించుకున్నారు. కైరునిస బ్యాగం, దేముడుబాబు, దావుద్, వియ్యపు తాతారావు, సోమరెడ్డి, వియ్యపు వెంకటఅప్పలరాజులను పూర్వవిద్యార్థులు సత్కరించారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనానికి దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండపైన ఆలయ పరిసర ప్రాంతాల్లో సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లో షామియానాలను ఏర్పాటుచేశారు. 70 వేల మందికి అవసరమైన ప్రసాదాలు అందుబాటులో ఉంచారు. కొండ దిగువ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ఉత్తర దూరదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నరేష్‌కు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత నాస్తిక సమాజం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భైరి నరేష్‌కు కెసిఆర్ ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఆ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయ్యప్ప స్వామిపై చేసిన వ్యాఖ్యల ఫలితంగా ఆ రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలను కట్టడి చేయాలని, శాంతి భద్రతలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ (4) ప్రకారం శాస్త్రీయ ఆలోచనలను భైరి నరేష్ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అయ్యప్ప పుట్టుకలో ఉన్న వాస్తవాన్ని చెప్పడం ద్వారా తమ మనోభావాలు దెబ్బతిన్నాయని కొందరు గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు.

నూతనోత్తేజంతో పోరాటం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సమస్యల పరిష్కారానికి నూతనోత్తేజంతో పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని భవన నిర్మాణ రంగ కార్మికుల అసోసియేషన్, సిఐటియు రాష్ట్ర నాయకులు రామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తాపీ మేస్త్రీల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ముందుగా భవన నిర్మాణ కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత మూడేళ్ల చేదు అనుభవాలను విడిచి, కొత్త సంవత్సరంలో నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలన్నారు. కార్మిక చట్టాలు, హక్కులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, సంక్షేమబోర్డు నిధులను మళ్లించి అన్యాయం చేస్తున్నారని తెలిపారు.

ఘనంగా సఫ్దర్ హష్మీ వర్ధంతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజా కళాకారుడు, వీధినాటక ప్రయోగ కర్త, వీధి నాటకాన్ని పోరాట ఆయుధంగా మలిచిన మానవతావాది సఫ్దర్ హష్మీ 34వ వర్ధంతిని ప్రజానాట్యమండలి ఆరిలోవ కమిటీ ఆధ్వర్యాన సోమవారం రవీంద్రనగర్ బస్టాపు వద్ద ఘనంగా నిర్వహించారు. ప్రజా నాట్యమండలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.అప్పారావు, లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు చంటి, సూర్యనారాయణ, రమణ, సన్యాసమ్మ, నాగరాజు తదితరులు హష్మీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వి.నరేంద్రకుమార్, వి.కృష్ణమూర్తి మాట్లాడుతూ, కార్మిక వర్గం హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాల్లో ప్రజా నాట్యమండలి కళాకారులు కళారూపాలు ప్రదర్శిస్తూ ప్రజా చైతన్యానికి బాసటగా నిలిచారన్నారు. కళాకారుడు హష్మీ బాటలోనే ప్రజానాట్యమండలి కళాకారులు నడవాలని పిలుపునిచ్చారు.

సఫ్దర్ హష్మీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఒబిసి ఉద్యోగుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని నెహ్రూ పార్కులో ఒబిసి ఉద్యోగులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ నెల 7వ తేదీన జరిగే అసోసియేషన్ ఎన్నికలలో గుర్తింపు కోసం మహాత్మా జ్యోతిరావుపూలే ఫౌండర్స్ ప్యానల్ ప్రచారంలో భాగంగా ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సమావేశంలో కమిటీ అభ్యర్థులు, వివిధ విభాగాల ఉద్యోగులు, ఆర్‌హెచ్.కాలనీ నాయకులు, ఆత్మీయులు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొన్నారు. గత ఐదేళ్లుగా ఒబిసి ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే ప్రస్తుత నాయకత్వాన్ని బలపరుస్తూ ఎన్నికల్లో గెలుపొందేందుకు అందరూ కృషిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కోమటి రవిశంకర్, నక్కా వెంకట రమణ, నెల్లి అప్పలరాజు, పిల్లి చంద్రరావు, ఎన్నేటి రమణ, కాంబ్లే, నమ్మి తాతారావు, చిత్రాడ కల్యాణి, ఎల్లేటి శ్రీనివాస్, చిత్రాడ రమణ, వి.ఎం.నాయుడు, కెజె.అప్పారావు, విఎస్ఆర్.మూర్తి, నమ్మి సత్యనారాయణ, ప్రగఢ గోవిందరాజులు, రాజమోహన్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో ఒబిసి ఉద్యోగులు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని యువతి దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక కూడలి వద్ద లారీ ఢీకొని ఓ యువతి ప్రాణాలు కోల్పోయింది. ఆరిలోవ సిఐ ఇమ్మాన్యుయేల్‌రాజు కథనం ప్రకారం... పెదగదిలి ప్రాంతానికి చెందిన హేమ (18) కొమ్మాదిలోని ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆమెతో పాటు పెదనాన్న కుమార్తె, ఆమె భర్త కూడా అక్కడే పనిచేస్తున్నారు. శనివారం రాత్రి పని ముగించుకొని కొమ్మాది నుంచి ఆ ముగ్గురితో పాటు తన అక్క కుమారుడు (చిన్నబాబు) ద్విచక్రవాహనంపై పెదగదిలి వస్తున్నారు. హనుమంతువాక కూడలి వద్ద సిగ్నల్ పడడంతో బైకు ఆపారు. అదే మార్గంలో వస్తున్న మిక్సర్ లారీ ద్విచక్రవాహనం వెనుక ఆగి ఉంది. దాని వెనుక వస్తున్న లారీ బ్రేకులు ఫైయిల్ అవ్వడంతో ముందున్న మిక్సర్ లారీని బలంగా ఢీకొట్టింది. మిక్సర్ లారీ ముందు ఆగి ఉన్న బైకిస్టును ఢీకొట్టడంతో బైకు వెనుక భాగంలో కూర్చున్న హేమ ఒక్క సారి కింది పడిపోయింది. మిక్సర్ లారీ చక్రాలు ఆమెపై నుంచి వెళ్లాయి. దీంతో హేమ తల నుజ్జయిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె అక్క, బావ, చిన్న బాబుకు ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. విషయం తెలుసుకున్న ఆరిలోవ సిఐ ఇమ్మాన్యుయేల్ రాజు, ద్వారకా ఎసిపి మూర్తి, ఎస్ఐ అనీల్ కుమార్ అక్కడకు చేరుకొని మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -తగరపువలస : తాళ్లవలస పెట్రోల్ బంక్ వద్ద డిసెంబర్ 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పాత గాజువాక, కార్మికనగర్‌కు చెందిన చప్పా గౌరీశ్వరరావు (53) తాళ్లవలస పెట్రోల్ బంక్ వద్ద ట్యాంకర్‌ను నిలిపి వేసి రోడ్డు దాటుతుండగా, విశాఖ నుంచి తగరపువలస వైపు అతి వేగంగా వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌరీశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు మృతి చెందాడు. మృతుని కుమారుడు మధు ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని తాడిచెట్లపాలేనికి చెందిన మెట్ట జ్యోతి గణేశ్వర్ (19) కనిపించడం లేదంటూ ఆమె తల్లి మెట్ట శ్రీవతి ఆదివారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జ్యోతి గణేశ్వర్ సిరిపురంలోని విఐపి రోడ్డులో ఉన్న హాలిడే వండర్స్ సంస్థలో పని చేస్తుందని, ప్రతి రోజూ ఉదయం 11 గంటలకు ఆఫీసుకు వెళ్లి సాయంత్రం 8 గంటలకు ఇంటికి చేరుకునేదని, గత నెల 28 నుంచి కనిపించకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. జ్యోతి గణేశ్వర్ బ్లాక్ టీ షర్ట్, బ్లూ ప్యాంట్ ధరించి ఉందని తెలిపారు. గత మార్చిలో ఇల్లు వదిలి లక్ష్మణ్ అనే వ్యక్తి వద్దకు వెళ్లి నెల తర్వాత ఇంటికి తిరిగి వచ్చినందున ఈసారీ అతని వద్దకే వెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి చంద్రంపాలెం గ్రామ రచ్చబండ వద్ద పెంచిన పెన్షన్లు ఆదివారం పంపిణీ చేశారు. గత నెల వరకు రూ.2500ఉన్న పింఛను జనవరి 1వ తేదీ నుంచి రూ. 250 పెంచి రూ.2,750 చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, నాయకులు పిళ్లా సూరిబాబు, పివిజి.అప్పారావు, పోతిన పైడిరాజు, జగుపిల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి ఆధ్వర్యాన రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లు రూ.2,750 చొప్పున ఆదివారం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో చందక సూరిబాబు, షిణగం రామారావు, చందక అప్పలస్వామి, శంకర్, వార్డు మెంబర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భీమునిపట్నం : వైసిపి ప్రభుత్వం సంక్షేమానికే పెద్ద పీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు స్థానిక వైసిపి కార్యాలయం ప్రాంగణంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జివిఎంసి పరిధి 4 వార్డుల్లో ప్రస్తుతం 8,448 పింఛన్లు ఉండగా, వీటికి అదనంగా 332 పింఛన్లు మంజూరైనట్లు వివరించారు. పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జివిఎంసి 1, 3, 4 వార్డుల కార్పొరేటర్లు అక్కరమాని పద్మ, గంటా అప్పలకొండ, దౌలపల్లి కొండబాబు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న వైసిపి నాయకులు

పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పెరిగిన పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ లక్ష్మి

3న సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సిరిపురం : 'భానుమతి పాట.. సీవీ రాజేశ్వరి నోట' శీర్షికతో ఈ నెల 3న నిర్వహించే సినీ సంగీత విభావరిని విజయవంతంచేయాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ప్రసాదరెడ్డి కోరారు. ప్రఖ్యాత సంగీత దర్శకులు ఎవి.కృష్ణారావు నిర్వహణలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఉదయం వీసీ తన చాంబర్‌లో రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ సమన్వయకర్త శైలజా మెరాజ్ మాట్లాడుతూ, ఈ నెల 3వ తేదీన సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో గాయని సీవీ రాజేశ్వరి మూడు గంటల పాటు నిర్విరామంగా భానుమతి పాటలు ఆలపిస్తారన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జిఎస్ఎన్.రాజు, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయని, ఏయు అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీవీ రాజేశ్వరి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, గాయకుడు సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

పేరి శ్రీనివాసరావుకు సత్కారం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉద్యోగ విరమణ పొందిన ఆచార్య పేరి శ్రీనివాసరావును ఆదివారం ఆదివారం వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి ఆధ్వర్యాన సత్కరించారు. మూడున్నర దశాబ్దాలుగా ఆచార్య పేరి శ్రీనివాసరావుతో ఉన్న అనుబంధాన్ని, స్నేహాన్ని విసి గుర్తుచేసుకున్నారు. నిరంతరం విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి, సహాయం చేయడానికి పేరి శ్రీనివాసరావు ముందుండేవారని కొనియాడారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి ఆయన విశేష కృషిచేశారన్నారు. విభాగాధిపతిగా, ప్లేస్‌మెంట్ అధికారిగా తనకు అప్పగించిన ప్రతి బాధ్యతనూ నిర్వర్తిస్తూ పదవులకే వన్నెతెచ్చిన వ్యక్తిగా పేరి శ్రీనివాస రావు సుపరిచితులన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వి.విజయలక్ష్మి, ఎస్‌కె భట్టి, ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విజయానంద రావు, ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పేరి శ్రీనివాసరావు దంపతులను సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

పేరి శ్రీనివాసరావు సత్కార సభలో మాట్లాడుతున్న విసి ప్రసాదరెడ్డి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఎంపిపి ఛాంబర్‌లో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ఛాయా గౌతమి, ఎంపిటిసి నీలిమ

ప్రజాశక్తి-యంత్రాంగం : విశాఖ జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

మధురవాడ : ఎండాడ భీమిలి జనసేన కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్మ ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బివి కృష్ణయ్య, శేఖర్, శ్రీనుబాబు, నాయుడు, పిల్లా శ్రీను, నాని, తిరుమలరావు, చిన్న, దేవి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును నియోజకవర్గ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, సర్పంచులు గాడు వెంకట నారాయణ, సిరిగిడి సంతోషి, పొట్నూరు ఛాయా గౌతమి, కొల్లి పార్వతి, ఎస్.శ్రీనివాసరావు, మజ్జి సూరినాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, నియోజక వర్గ పరిధిలోని ఎంపిపిలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో..

భీమిలి ఎంపిడిఒ కార్యాలయంలోని ఎంపిపి ఛాంబర్‌లో ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజును మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, పలు గ్రామాల ప్రజలు కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు.

టిడిపి కార్యాలయంలో...

స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబును నియోజకవర్గంలో ఉన్న ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి కలిశారు. పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభా కాంక్షలు తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు స్వగృహాలకు అభిమానులు, కార్యకర్తలు చేరుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం 10 గంటలకు కార్యకర్తలు అభిమానులు భీమిలి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తిగత నూతన కేలండర్లను ఆవిష్కరింపజేశారు. అనందపురం మండలం విద్యార్థి విభాగం అధ్యక్షులు రౌతు శ్రీను ఆర్థిక సహాయంతో 2023 కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, సర్పంచ్ లెంక రాంబాబు, కోరాడ రామారావు, కోరాడ రాంబాబు, పల్ల రమణ, గవర ఈశ్వరరావు, సోమనాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, పోర్టు అథారిటీ చైర్మన్ కె.రామమోహన్‌రావును గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొరబు సత్యనారాయణ, రుడా సత్యారావు, డిప్పల సాంబమూర్తి, కటారి శోభన్ కుమార్, కృష్ణ నాయక్, గీత, మూర్తి శేఖర్ పాల్గొన్నారు.

విశాఖపట్నం క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ కేకును కట్ చేశారు. క్రైమ్ రిపోర్టర్లందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దాడి రవికుమార్, ఎంఎస్ఆర్.ప్రసాద్, పలు పత్రికల బ్యూరో చీఫ్‌లు, క్రైమ్ రిపోర్టర్లు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం సందర్భంగా జీవీఎంసీ 32వ వార్డు పరిధి నేరెళ్ల కోనేరులో కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వైసిపి యువనేత ద్రోణంరాజు శ్రీవాత్సవ హాజరయ్యారు. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త స్ఫూర్తిని, విజయాలను తీసుకురావాలని ఆయనఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైవసిపి సీనియర్ నాయకుడు సలీం, కందుల బదరీనాథ్, స్థానికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : సిపిఐ విశాఖ జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జిల్లా పరిధిలో గల కోరమండల్ వర్కర్స్ యూనియన్, రైల్వే సిటిఎస్, ఆటో వర్కర్స్ యూనియన్, మహిళా సమాఖ్య, ఎఐఎస్ఎఫ్,ఎఐవైఎఫ్ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్మికులు, యూనియన్ నేతలు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె రెహమాన్, క్షేత్రపాల్, మురళి, శ్రీను, అశోక్, శంకర్, సత్యనారాయణ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



నూతన కేలండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మున్సిపల్ వర్కర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ....

జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఆవిష్కరించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జి. సుబ్బారావు, అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, కార్యదర్శులు గొలగాని అప్పారావు, జెఆర్ నాయుడు, నాయకులు ఎం.ఈశ్వరరావు, వెంకటరావు, ఇ.ఆదినారాయణ, గణేష్, శ్రీను, అప్పలరాజు, చిన్నారావు, కెవి.రమణ తదితరులు ముందుగా జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్, ఎడిసి, సిఎంఒహెచ్ లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ కార్యాలయంలో

ఎల్లమ్మ తోట జంక్షన్లో ఉన్న నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుత్తుల శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర బిసి సంఘం వైస్ చైర్మన్ తోట వాసుదేవరావు, హైదర్ అలీ సింకా, చొడదాసి సుధాకర్ పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. వైసిపి సమన్వయకర్త కెకె.రాజుకు నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళలు, నియోజకవర్గ ప్రజలు, అధికారులు, అభిమానులు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గాజువాక : షీలానగర్ పెట్రోల్ బంక్‌లో స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న, దొమ్మేటి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం గీత ఉప కులాల (యాత, శ్రీశయన, శెట్టి బలిజ, గౌడ, ఈడిగ) సంఘం సభ్యులు అందరూ కలిసి నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్లో సెక్రెటరీ యార్లగడ్డ వెంకన్న చౌదరి, రాజులపటి రాజశేఖర్, మట్టపర్తి నాగరాజు, దొమ్మేటి అప్పారావు, గొడ్డి కన్నారావు, జివివి సత్యనారాయణ, కడలి త్రినాధ్, కుడిపుడి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన...

షీలానగర్ పెట్రోల్ బంక్‌లో...

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

చేదు మిగిల్చిన చెరుకు!

చెరకు నరికి కట్టలు కడుతున్న రైతు మహిళ

- ▸▸ తెగుళ్లు ఆశించడంతో గణనీయంగా తగ్గిన దిగుబడులు
- ▸▸ పెట్టుబడులైనా వచ్చే పరిస్థితి లేదని రైతుల ఆవేదన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :ఈ ఏడాది చెరకు సాగు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలించిందని రైతులు వాపోతున్నారు. మండలంలో ప్రధానంగా వరి, వాణిజ్య పంటగా చెరకును సాగు చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో సాగులో ఉన్న చెరకు ప్రధానంగా గోవాడ చక్కెర కర్మాగారానికి ఎర్ర వాయి ప్రాంత రైతులు తుమ్మపాల ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేస్తుండేవారు. కొంతమంది రైతులు బెల్లం తయారీ చేస్తుంటారు. మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో చెరకు సాగు అవుతుంది. ఈ ఏడాది చెరకు పైర్లు తెగుళ్ల బారిన పడ్డాయి. ఏమాత్రం ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఎన్ని రకాల పురుగుల మందులు వాడి సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. గతంలో ఎకరాకు 20టన్నుల నుండి 30 టన్నుల వరకు దిగుబడి వచ్చే చెరకు ఈ ఏడాది కనీసం 10 టన్నులు దిగుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. చెరకు పైర్లకు మొవ్వ, పుచ్చ పులుసు పురుగు వ్యాపించడంతో చాలావరకు చెరకు తోటలు ఎండిపోయాయని రైతులు వాపోతున్నారు. దీంతో ఒక్కో ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు ఇపుడు లాభాల మాట అటుంచితే, పెట్టిన మదుపులైనా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు గోవాడ చక్కర కర్మాగారానికి చెరకును సరఫరా చేయడానికి పర్మిట్లను తీసుకుంటున్నారు. చెరుకు తోట నరికి, కట్టలుగా కట్టి, కాటాలకు తరలించడానికి పంట పొలాల్లో చెరకును తరలించడానికి సిద్ధమవుతున్నారు. అయితే దిగుబడి లేకపోవడంతో సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం రాదని రైతులు వాపోతున్నారు. ఒకపుడు మండలంలోని పలు గ్రామాల్లో బెల్లం తయారు చేసే క్రషర్ల సీజన్‌లో నిరాటంకంగా పనిచేసేవని, ఇపుడు ఆ పరిస్థితి లేదని చెరకు రైతులు వాపోతున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు

ఈ ఏడాది రెండు ఎకరాల్లో చెరకు సాగుచేశాను. రూ.40వేలు పెట్టుబడులు పెడితే, ఇపుడు 20 టన్నులైనా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. చెరుకు తోట నరకడం,కట్టలుగా కట్టడం రవాణా ఛార్జీలు వీటికే వచ్చే డబ్బులు సరిపోయేలా ఉన్నాయి.చాలానష్టం తప్పదు.

పెద్దిరెడ్ల గంగరాజు,
చెరకు రైతు, దిబిడి

వైసిపి ఆటవిక పాలనకు చరమగీతం పాడండి

ప్రజాశక్తి- దేవరాపల్లి : వైసిపి ఆటవిక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి మాడుగుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి కుమార్, సీనియర్ నేత పైలా ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండలంలో ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి దుర్మార్గ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రం ముఖ్యమంత్రి నవరత్నాలు పేరు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్రంలో వైసిపి నేతల భూకబ్జాలు అడ్డూఅదుపు లేకుండా ఉందన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశంఅధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో దూరంలో లేదన్నారు. గ్రామంలో వైసిపి పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టిడిపి నేతలు పోతల పాత్రునాయుడు, బండారు రామారావు, చింతా సాంబమూర్తి, రాయపరెడ్డి ఈశ్వరరావు, గర్రెడ్డి కొండల రావు, చల్లా నానాజీ కర్రి నాయుడు, గొర్రెపోటునరసింహమూర్తి పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ నిరసనలో పాల్గొన్న పైలా ప్రసాదరావు, టిడిపి నేతలు

డైరీలు, కేలండర్ల ఆవిష్కరణ

యుటిఎఫ్ డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి సుభాష్

ప్రజాశక్తి- అనకాపల్లి : కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో యుటిఎఫ్ కేలండర్‌ను, డైరీని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు యుటిఎఫ్ నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. అలాగే జెసి కల్పనకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డి, ఉపవిజ శాఖ అధికారి ప్రేమ్ కుమార్, ఏడి రవిబాబును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్న అబ్బాయి, ఉపాధ్యక్షులు గాయత్రి పొలిమేర చంద్రరావు, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శి జి అప్పలరాజు, సీనియర్ నాయకులు జీకేఆర్ స్వామి, అలివేలు పాల్గొన్నారు.

శ్రమజీవుల పత్రిక ప్రజాశక్తి

అనకాపల్లి : శ్రమజీవుల సమస్యలపై నిజాలను నిర్భయంగా రాసే పత్రిక ప్రజాశక్తి అని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అన్నారు. ఆదివారం గోపాలపురం గ్రామంలోని తన స్వగృహంలో ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరించారు. అనకాపల్లి రిపోర్టర్ అజయ్, డివిజన్ ఆర్గనైజర్ జె రమేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి సూరిబాబు

జన విజ్ఞాన వేదిక కరేలెండర్ విడుదల

అచ్చుతాపురం :జనవిజ్ఞాన వేదిక కేలండర్‌ను స్థానిక మండల పరిషత్ అధ్యక్షులు కోన సంధ్య బుజ్జి ఆదివారం ఆవిష్కరించారు. శాస్త్రీయ విజ్ఞాన సంబంధించిన చిత్రాలతో కేలండర్ మొత్తం ముద్రించబడడాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు, ఎంపిటిసి లాలం శ్రీను, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు మారిశెట్టి వెంకట అప్పారావు, బొడ్డెడ రాంకుమార్ పాల్గొన్నారు. అందలపల్లి గ్రామంలో ఓంశాంతి ఆధ్వర్యంలో కేలెండర్‌ను బి.వి.రమణ, బుద్ధ వెంకట సత్య రామ్ విడుదల చేశారు.

పింఛనుదారుల సంఘం డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పింఛనుదారుల సంఘం డైరీని ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లా సంఘం అధ్యక్షులు ఈర్లే శ్రీరామ్మూర్తి, ఇతర సంఘ నాయకులు కలెక్టరుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నక్కపల్లి:పిఆర్‌టియు ఉపాధ్యాయ యూనియన్‌కు సంబంధించిన క్యాలెండర్, డైరీ లను ఆదివారం ఎమ్మెల్యే గొల్ల బాబురావు అడ్డు రోడ్డులో తన క్యాంప్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎమ్మెల్యే బాబురావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నక్కపల్లి మండల శాఖ అధ్యక్షులు తోడపు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ప్రగడ శివాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.చలపతిరావు, జిల్లా ఉపాధ్యక్షులు డి.వి.సన్యాసిరావు, జిల్లా కౌన్సిలర్లు డి.నాగచారి, ఎం.శ్రీధర్, మండల ఉపాధ్యక్షులు ఎస్ కె.బాషా, సీహెచ్. ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు ఎస్.వి.రమణ, టి.గోపి, బివి రమణ, ఎం.నీలకంఠకుమార్, ఎం.శ్రీను, ఎస్.రమేష్, పి.నూకరాజు, సిహెచ్ శ్రీను, జి.నాగదుర్గ, ఆర్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో విద్యాశాఖ కార్యాలయం వద్ద పిఆర్‌టియు సంఘం క్యాలెండర్‌ను పి.అప్పారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఎంఈఓకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు ఉపాధ్యాయులు కూడా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్య ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల అధ్యక్షులు అబ్దుల్లా, కార్యదర్శి ప్రతాప్, రాష్ట్ర కౌన్సిలర్ డేవిడ్, అప్పారావు, గంగాధర్, రాజబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో పిఆర్‌టియు కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కోటవురట్లలో కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

గీత, యాత కార్మికులకు న్యాయం చేస్తా

గీత కార్మికులతో మాట్లాడుతున్న నూకరాజు

ప్రజాశక్తి- కశింకోట : గీత కార్మికులు. యాత ఉపకులాలకు న్యాయం జరిగేలా చూస్తామని ఉత్తరాంధ్ర యాత సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్ సమీపంలో గీత,యాత సంఘం సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి గీత కార్మికునికీ ప్రభుత్వ పథకం అందించాలనికోరారు. పలువురకి అర్హతలున్నా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను అందజేయలేదన్నారు. దీనిపై యాత కార్పొరేషన్ రాష్ట్ర అద్యక్షులు పిల్లి సుజాత ద్వారా ముఖ్యమంత్రితోపాటు సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కశింకోట, అచ్చర్ల గీత కార్మికులు సంఘం అధ్యక్షులు కట్టా ఈశ్వరరావు, దుంగా ఈశ్వరరావు యాత సాంస్కతిక సేవా సంఘం సిబ్బంది యల్ నాగరాజు , దుంగా తాతారావు గీత కార్మికులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో మేలు

ప్రజాశక్తి - దేవరపల్లి : ఈనెల 2నుంచి జరగనున్న గ్రామసభలకు 29 శాఖల మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరై విజయవంతం చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ తెలిపారు ఆదివారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి నిలువెత్తు నిదర్శనం గ్రామసభలని, అన్ని మండలాల ఎంపిడిఒలు గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామసభలు జరుగుతున్న సమయంలో అధికారులు ఫోటోలు ,వీడియోలు ద్వారా గ్రామసభలు జరుగుతున్న మొత్తం తీరును రికార్డు చేయాలన్నారు.

వికేంద్రీకరణ పరిపాలన వ్యవస్థకు గ్రామసభలు పునాదులు వంటివని, ప్రభుత్వ పాలనలో పారదర్శకతను సాధించడమే కాక గ్రామపంచాయతీలను, మున్సిపాలిటీలను, ప్రజలకు జవాబుదారీగా మలచడంలో గ్రామసభలు లేదా వార్డు సభలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామసభలు నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే అధికారులతోపాటు ఉపముఖ్యమంత్రి బూడి దృష్టికి తీసుకెళతామన్నారు.

వైసిపి బిసి సెల్ ఉపాధ్యక్షునిగా మహాలక్ష్మినాయుడు

మహాలక్ష్మినాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి. --సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గ బిసి సెల్ ఉపాధ్యక్షులుగా మహాలక్ష్మి నాయుడును నియమించారు. నూతన సంవత్సరం సందర్భంగా తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఈ మేరకు నియామక ప్రకటన వెల్లడించారు. దీనిపై మహాలక్ష్మినాయుడు స్పందిస్తూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆరిపాక పంచాయతీ వైసిపి నేతలు మళ్ల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ శరగడం వెంకట శ్రీనివాసరావు, శరగడం సురేష్, వార్డు సభ్యులు పొలమేరశెట్టి అప్పారావు, శరగడం నాగేష్, బొడ్డేటి జానకిరామ్ పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ

క్రికెట్ కిట్లు అందజేస్తున్న అంజిబాబు

ప్రజాశక్తి- కె.కోటపాడు : యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని జనసేన మండల నాయకులు కుంచ అంజిబాబు కోరారు. ఆదివారం మండలంలోని కింతాడ శివారు గొల్లలపాలెం గ్రామంలో తన సొంత నిధులతో సమకూర్చిన క్రికెట్ కిట్లను ఆ గ్రామానికి చెందిన నాయకులు కడుపుట్ల గంగునాయుడు చేతుల మీదగా యువతకు అందజేశారు. క్రీడల పట్ల ఆసక్తి కనబరిస్తున్న యువతను ప్రోత్సహించుటకు ఇప్పటికే మండలంలో పలు గ్రామాల్లో క్రికెట్ కిట్లు పంపిణీ చేశామన్నారు కార్యక్రమంలో మజ్జి ఈశ్వరరావు(చిన్న) రాజు. మహేష్. కోటి. గణేష్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో 35 గ్రామపంచాయతీల్లో 319 కొత్త పెన్షన్లు మంజూరు అయ్యాయని ఎంపిడిఒ సువర్ణరాజు తెలిపారు. వద్ధాప్య వితంతు వికలాంగ తదితర పెన్షన్‌దారులు ఉన్నారన్నారు. కొత్త పింఛనుదారులకు పింఛను వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ద్వారా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మాకవరపాలెం: మండలంలో కొత్తగా 348 కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత కొన్ని నెలల కాలంగా అందిన పింఛన్ దరఖాస్తులను పరిశీలించి కొత్తగా పింఛన్లు మంజూరు చేశామన్నారు. డిసెంబర్ నెలలో 89 మందికి నోటీసులు ఇవ్వగా వారిలో 58 మంది అర్హులుగా తేలినట్లు తెలిపారు.

వేతన బకాయి చెల్లించరూ..

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పంచాయతీలో పారిశుధ్య పనులకు టెండర్ దక్కించుకున్న చంద్రయ్య అనే కాంట్రాక్టర్ గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి పంచాయతీ పరిధిలో ఐదుగురు కాంట్రాక్టు కార్మికులతో పనిచేయించాడన్నాడు. పంచాయతీ పరిధిలో స్థానిక మార్కెట్,అల్లూరి వీధి, దుర్గా వీధి, తదితర ప్రాంతాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టిన తమకు గడచిన మూడు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించడం లేదని,ఈగల సింహాచలం అనే పారిశుధ్య కార్మికుడు ప్రజాశక్తి వద్ద తన ఆవేదన వ్యక్తం చేశాడు. అసలే అరకొర వేతనాలు, వాటిని సకాలంలో సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ అగమ్యగోచరంగా మారుతోందని వాపోయాడు. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని, నూతన సంవత్సరాదిన చేతిలో చిల్లిగవ్వ లేని స్థితిలో అల్లాడుతున్నామని అంటున్నాడు. ఇప్పటకైనా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ చొరవ తీసుకుని తమకు వేతన బకాయి చెల్లింపునకు చర్యలు చేపట్టాలని, లేకుంటే మూకుమ్మడి పనులు నిలుపుదల చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఎర్రగొండమ్మను దర్శించుకున్న ఎంపీ దంపతులు

ప్రజాశక్తి -కొయ్యూరు :. కొయ్యూరు మండలం శరభన్నపాలెం. నడింపాలెం గ్రామాల మధ్య కొలువైయున్న ఎర్రగొండమ్మ తల్లిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి శివప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు, ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డిపై, రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకున్నానన్నారు. ఈ సందర్భంగా అక్కడున్న ఆలయ సమస్యలు తీర్చాలంటూ ఎంపీకి ఆలయ కమిటీ ప్రతినిధులు, సర్పంచ్ వినతిపత్రం అందజేశారు.

పొందూరు వంతెన నిర్మాణం కలేనా?

మధ్యలో నిలిచిన పనులు
రవాణా సౌకర్యం లేక ప్రజలు అవస్థలు

పిల్లర్లతోనే అర్థాంతరంగా నిలిచిన పొందూరు వంతెన నిర్మాణ పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని పొందూరు గ్రామం వద్ద వంతెన నిర్మాణం కలగా మిగిలింది. పొందూరు గ్రామం వద్ద వరాహ నదిపై గత ప్రభుత్వంలో సుమారు రూ.8 కోట్లతో ఇక్కడ నిర్మించ తలపెట్టిన వంతెన అసంపూర్తిగా నిర్మించి వదిలివేయడంతో గడిచిన నాలుగు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా

ఏళ్ల తరబడి రాకపోకలకు దిక్కయిన డైవర్షన్ రోడ్డు

పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షాకాలం సమయంలో అవస్థలు పడాల్సి వస్తుంది.

అంతేకాకుండా పందూరు గ్రామానికి సంబంధించిన ప్రధాన ఆదాయ వనరు జీడి, మామిడి, తోటలు అధికంగా ఉండటంతో వాటి రవాణా చేసేందుకు రైతులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో వర్షాలు అధికంగా వచ్చినప్పుడు పురాహనది పొంగి దాదాపు జనజీవనం స్తంభించి పోతుంది. గ్రామంలో ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు, మండల వాసులు పలువురు పలు విధాలుగా అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి వంతెనను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

పింఛన్ల తొలగింపు దారుణం

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

పింఛను రద్దు నోటీసు అందుకున్న వృద్ధురాలితో రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : లేనిపోని కారణాలను సాకుగా చూపి కొన్నేళ్లుగా వేర్వేరు ప్రభుత్వాల హయాంలోనూ పొందుతున్న వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లును తొలగించడం దారుణమనిలోదొడ్డి సర్పంచ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు విమర్శించారు. కొత్త సంవత్సరంలో లబ్ధిదారులకు ఇచ్చిన కానుక ఇదేనా అని ప్రశ్నించారు. ఆదివారం లోదొడ్డి పంచాయతీలోని పింఛన్లు కోల్పోయిన లబ్ధిదారులతో మాట్లాడారు. ఏ కారణంతో అనర్హులుగా తేల్చారో వివరాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, లోదొడ్డి పంచాయతీ మాతే బంగారమ్మ అనే వద్ధ మహిళకు భర్త బతికున్నాడన్న కారణంతో ఆరు నెలలుగా పింఛను నిలిపేశారనానరు. బంగారమ్మ భర్త చనిపోయి ఎనిమిదేళ్లవుతుండగా, ఇపుడు రికార్డుల్లో బతికున్నట్లు పేర్కొని, పింఛను తొలగించి, నిరుపేద వితంతు మహిళలకు ఆసరా లేకుండా చేశారని మండిపడ్డారు. పంచాయతీ పరిధిలో ఇలాగే ఐదుగురు అర్హులైన లబ్ధిదారులకు లేనిపోని కారణాలను చూపి అన్యాయంగా తొలగించేశారన్నారు. జనవరి నుంచి ప్రభుత్వం కొత్తగా పెంచిన రూ.250లతో కలిసి కొత్త సంవత్సరం, సంక్రాంతికి పింఛను డబ్బులు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఆవేదన గురిచేయడం ఎంతవరకు సమంజసం కాదని ప్రశ్నించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి, ఏ ఒక్కరి పింఛను రద్దు చేయకుండా అర్హులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. కుంటిసాకులతో పింఛన్లు తొలగిస్తే లబ్ధిదారులను సమీకరించి, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పింఛను పెంపుపై హర్షం

అచ్యుతాపురంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పింఛను మొత్తాన్ని జనవరి నుంచి రూ.2500కు అదనంగా రూ.250 పెంచి రూ.2750 అందజేస్తుండడంతో పింఛనుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, ఎంపిటిసిలు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పింఛను మొత్తం పెంపుపై వైసిపి నేతలు, పింఛనులబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం పలు గ్రామాలలో పాలాభిషేకం చేశారు. వైసిపి మండల అధ్యక్షులు దేశం శెట్టి శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి కోన సంధ్య, బుజ్జి, భీముని వెంకటేశ్వరరావు, నిర్మల కుమార్, కె విమలా నాయుడు, గొర్రె అశ్విని నూకరాజు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పెంపుతో పాటు కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి కొత్తగా 101పింఛన్లు మంజూరయ్యాయని ఎంపికి కిలపర్తి రాజేశ్వరి, ఎంపిడిఒ సిహెచ్.సుబ్బలక్ష్మి వెల్లడించారు. పింఛను పెంపు సందర్భంగా సర్పంచ్ రొంగలి వెంకటరావు (నీలిమ) ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సిఎం జగన్, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు, కతజ్ఞతలు తెలిపారు.

చీడికాడ :మండలంలో వివిధ గ్రామాల్లో పెంచిన ర.2750 పింఛన్లను పంపిణీ చేశారు. చీడికాడ మండలం చీడికాడ, అప్పలరాజుపురం, వరాహపురం, తునివలస గ్రామాలలో ఎంపీపీ కొరచా జయమ్మ నారాయణమూర్తి, స్థానిక సర్పంచులు చేతుల మీదుగా పెన్షన్లను పంపిణీ చేశారు. కొత్త పెన్షన్లను మంజూరు చేసినందుకు వృద్ధులు, వితంతువులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, పార్టీ కన్వీనర్ గొల్లవెల్లి రాజబాబు, వైస్ సర్పంచ్ మిస్కా అర్జున, గ్రామ అధ్యక్షులు ధర్మిశెట్టి అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో పింఛను పంపిణీ చేస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

వెంకన్నను ఊరేగిస్తున్న భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు పుణ్యకోటి వాహనంలోనూ, గోదాదేవి అమ్మవారు పల్లకిలోనూ తిరు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

స్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున రెండు గంటలకు గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకములు పూజాది కార్యక్రమములు నిర్వహించిన తరువాత సాయంత్రం 6 గంటల వరకు భక్తులందరికీ స్వామివారి దర్శనం సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులకు రంగనాథుని అలంకారంలో పుణ్యకోటి వాహనంలోనూ ఆలయంలో వివిధ వాహనాల్లో వివిధ ఉత్సవమూర్తులతో ఎనిమిది వాహనములలో తిరువీధి సేవ నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు .

వెంకన్నకు పూజలు

ఎస్.రాయవరం: ధనుర్మాసం వచ్చిందంటే ఏడుకొండల వెంకన్న భక్తులకు పండుగే. స్వామి వారి మాలధారణ చేసి పూజలు చేస్తూ ఆధ్యాత్మికంగా గడుపుతారు. శనివారం రాత్రి అడ్డురోడ్డులోని బత్తుల జగదీష్, అచ్చిరాజు సోదరుల ఇంట వెంకన్న పూజ లు కమనీయంగా సాగింది. ముందుగా గణపతి, లక్ష్మీ దేవి పూజల అనంతరం వేంకటేశ్వరస్వామి వారికి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొరుప్రోలు సీతారామ భజనమండలి సభ్యులచే హరినామ సంకీర్తన (భజన) చేపట్టారు.

సిఎం జగన్‌కు పాలాభిషేకం

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలో కొత్త పింఛన్లు మంజూరు, ఉన్న వాటిని పెంచడంతో తామరం పంచాయతీలో వైసిపి సర్పంచ్ గొంతెన చెల్లారత్నం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో. వైస్ ఎంపీపీ లక్ష్మి హరిబాబు, నాయకులు, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

అనకాపల్లిలో మంత్రి అమర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారులు

చీడికాడలో పైలాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

అనకాపల్లి జిల్లాలో నూతన సంవత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు నేతల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు, అధికారులు తరలి వచ్చారు.

ప్రజాశక్తి. -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవో చిన్నికృష్ణ, ఉద్యోగులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఉపాధ్యాయులు, కిందిస్థాయి ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేసి కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణ కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు.

నేతల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద సందడి

అనకాపల్లి : నూతన సంవత్సర వేడుకలు నేపథ్యంలో వివిధ రాజకీయ నాయకుల ఇల్లు, కార్యాలయాలు సందడిగా మారాయి. పెద్ద ఎత్తున పార్టీల నాయకులు కార్యకర్తలు, అధికారులు అనధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరవచ్చారు మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఎంపిపి గొర్లి సూరిబాబు, కసింకోట జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ, కసింకోట మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపిపికలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మి రామకృష్ణ, అనకాపల్లి ఎంపిడిఒ చంద్రశేఖర్, డిఎస్‌పి బి సునీల్, సిఐలు మోహనరావు, రవికుమార్, ఎపిఐఐసి జెడ్‌ఎం త్రినాథ్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రింగ్‌రోడ్‌లోని టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావుకు పార్టీ శ్రేణులు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మాడుగుల ఇన్చార్జ్ పివిజి కుమార్, చోడవరం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, ఎలమంచిలి ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పైలా ప్రసాదరావు, గూనూరు మల్లు నాయుడు, ఎలక మల్లి బాబు, ఉగ్గిన రమణమూర్తి, డాక్టర్ నారాయణరావు, కాయల మురళి, కుప్పిలి జగన్మోహన్, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు స్వగహంలో, కొణతాల సుబ్రహ్మణ్యం ఘాట్లో మాజీ మంత్రి కొణతాల రామకష్ణలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు ఇంటి వద్ద, ఎంపీపీ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు, అనధికారులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, జీవీఎంసీ 82 వార్డు కౌన్సిలర్ మందపాటి సునీత స్వగృహంలో వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలియజేశాయి.

ఎంపీ సత్యవతికి ఐద్వా నేతల శుభాకాంక్షలు

అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి వి సత్యవతికి ఎంపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అరుణ ఆధ్వర్యంలో ఐద్వా నేతలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేరళలో ఈనెల 6 నుంచి 9 వరకు జరిగే ఐద్వా అఖిలభారత మహాసభల వివరాలను ఎంపీకి వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మహిళల సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఐద్వా కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి సుభాషిని, సిహెచ్ రూపాదేవి, వివి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంవీఆర్ ఇంట సందడి

అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు నాయకులు నరసింగరావుపేట ఎంవిఆర్ స్వగహంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎంవిఆర్ ఆకాంక్షించారు. ఎంవిఆర్ యువసేన, అభిమానులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావుకు మండలంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలను అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు..

బుచ్చయ్యపేట : టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబుకు టిడిపి కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల వైసిపి అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చంనాయుడుకు పెద్దమదిన లోను, ఎంపిపి దాకారపు నాగేశ్వరి దేవికి సీతయ్యపేటలో వైసీపీ నాయకులు కలసి కార్యకర్తలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

అచ్యుతాపురం : కొండకర్ల ఆవలోని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు స్వగృహానికిఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు తరలివచ్చి పుష్పగుచ్ఛాలను అందించిన నూతన సంవత్సర శుబాకాంక్షలు తెలిపారు.

తెలుగుదేశం పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావును అచ్యుతాపురంలో తన స్వగహమునందు పార్టీ కార్యకర్తలు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు తదితరులు తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్‌కుమార్‌కు అచ్యుతాపురంలో పార్టీ కార్యాలయంలో జనసైనికులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కె.కోటపాడు : నూతన సంవత్సరం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ప్రతినిధులు పలువురు ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను విజయనగరంలో కలిసి,. పుష్ప గుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అపుస్మా స్టేట్ చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి, స్టేట్ ట్రెజరర్ ఎంవి.రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టరు శ్రీనివాసరావు, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ (ఐటీవిభాగం) డాక్టరు ఖాసీమ్, రీజనల్ ప్రెసిడెంట్ మధు, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం శ్రీకాకుళం జిల్లాల అపుస్మాప్రతినిధులు ఉన్నారు.

నర్సీపట్నంటౌన్: స్థానిక రుత్తల లచ్చా పాత్రుడు స్కేటింగ్ రింగ్లో ఆర్పి స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుంగ్ ఫు, కరాటే, జూడో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటున్న విద్యార్థులకు 5వేల రూపాయలు విలువ చేసే పరికరాలను అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు ఉచితంగా అందజేశారు. వారణాసిలో మెడల్స్ సాధించిన విద్యార్థులందరికీ జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ నారాయణరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ బలిరెడ్డి అప్పారావు, రావణాపల్లి జలాశయ చైర్మన్ లాలం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ఎస్ఐ రామకృష్ణకు టిడిపి మండల అధ్యక్షుడు రుత్తల యర్రపాత్రుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ఎస్సై రామకృష్ణ సేవలు అందిస్తున్నారన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామనాయుడు, మండల ఎంపీటీసీలు, సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యస్.రాయవరం: నూతన సంవత్సర వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుండి కొరుప్రోలు గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును నాలుగు మండలాల నుండి విచ్చేసిన నాయకులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. యువత కేరింతలతో అర్ధరాత్రి దాటిన తరువాత నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి.

పైలాకు శుభాకాంక్షలు

చీడికాడ: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావుకు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పైలా యువ సేన అభిమానులు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రసాదరావుకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

యస్.రాయవరం: నూతన సంవత్సర వేడుకల్లో జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ పాల్గొన్నారు. అడ్డురోడ్డులో నియోజకవర్గంలోని వివిధ ఛానళ్ళు, పేపర్లకు చెందిన స్థానిక విలేకరులతో కలిసి ఆయన కేకును కట్ చేశారు. సీనియర్ విలేకరి ముత్తా గోవిందరావు జన్మదినంను పురష్కరించుకుని ఆయనకు జర్నలిస్టు మిత్రులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6 టివి బ్యూరో కన్నబాబు, జ్యోతి దినపత్రిక జిల్లా బాధ్యుడు వెలగా లోవరాజు, అర్జున్, మొల్లేటి రుద్ర, ముద్దా రాజు, సమ్మెంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రాజకీయ నాయకులు ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకొంది. తంగేడు గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు , మండల వైస్ ఎంపీపీ దత్తుడురాజు ఇంటి వద్ద వైసిపి కార్యకర్తలు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అదే విధంగా నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను ఇంటి వద్ద కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు వెంకటాపురం గ్రామంలో బీసీ సెల్ అధ్యక్షులు, వైసిపి నాయకులు పైలా రమేష్ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా నేటి నుండి పెరిగిన సామాజిక భద్రత పింఛన్లు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు అదేవిధంగా అధికారులు స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావుకు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలి వెళ్లారు.



ఎమ్మెల్యే బాబూరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేత

సమైక్య అపార్టుమెంట్‌లో వేడుకలు

గాజువాక : తోకాడ సమైక్య అపార్టుమెంట్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు అపార్టుమెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి తవిటయ్య బహుమతులు అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

పిల్లలకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-రేలుగుంట:మండలంలోని బుచ్చంపేట గ్రామ పంచాయతీకి చెందిన అనిమిరెడ్డి రమణ (వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి) తన సేవా కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం జిల్లా జీవీఎంసీ పరిధి జ్ఞానాపురం ఏరియా మమత ఛారి ట్రైబుల్ ట్రస్ట్‌లో సుమారు 80 మంది నిరుపేద పిల్లలకు నూతన సంవత్సరం సందర్భంగా అల్పాహారం, స్నాక్స్ పంపిణీ చేశారు. రమణ కుటుంబ సభ్యులందరికీ మమతా ఛారి ట్రైబుల్ ట్రస్ట్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించిన రమణకి తోటి ఉద్యోగులు, మిత్రులు అభినందనలు తెలియజేశారు.

దగ్ధమైన వరి కుప్పలు

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి -రావికమతం :ఆరుగాలం పండించిన వరి పంట అగ్నికి ఆహుతి అయ్యాయి. మండలంలో గుడ్డిప విశాఖ డైరీ పాల కేంద్రం సమీపంలో కల్లాల వద్ద పెట్టుకున్న వరి కుప్పలు ఆదివారం ఉదయం ఖాళీ బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన చెన్నం శెట్టి రాము, ఎన్నంశెట్టి వెంకు నాయుడు, గణేష్, కర్రి వెంకయ్యమ్మ, పిల్ల మహాలక్ష్మిఅమ్మ, గల్లా రాజు, ఎన్నంశెట్టి రాజు, అప్పలనాయుడు, ఇందల పెంటయ్యలకు చెందిన ఎనిమిది వరి కుప్పలు ప్రమాదవశాత్తు ఖాళీ బూడిదయ్యాయి. దీంతో, రైతులు లబోదిబో మంటున్నారు. సంవత్సర కాలం బతుకు పోయిందని కన్నీరు మున్నీరయ్యారు. సుమారు రూ.3 లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు పలువురు అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాద సంఘటనను తెలుసుకున్న రావికమతం అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏరియా ఆసుపత్రిలో..

లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం

- తీరనున్న ఆక్సిజన్ సిలిండర్ల కొరత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఏరియా ఆసుపత్రిలో అత్యవసర సమయంలో ప్రాణవాయువు అందించేందుకు లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు నిర్మాణం జరుగుతుంది. ఇప్పటివరకు ఆక్సిజన్ సిలిండర్లు కావాలంటే విశాఖపట్నం నుంచి తీసుకు రావాల్సి వచ్చేది. ఇకపై ఈ ఇబ్బందులు తప్పనున్నాయి. పది వేల లీటర్ల సామర్ధ్యంతో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటును నర్సీ పట్నం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేస్తున్నారు. ఔట్ పేషెంటు విభాగం ఎదురుగా ప్లాంటు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ ప్లాంట్‌కు సుమారు రూ. 5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే ట్యాంకు నిర్మాణం పూర్తయింది. ఆసుపత్రి అవసరాలకుగాను ప్రతి 15రోజులకోసారి అవసర నిమిత్తం తెచ్చేవారు. ఇకపై ఎప్పుడు కావాలంటే అప్పుడు సిలెండర్లను వినియోగించుకోవచ్చు. ప్రాంతీయ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధమైతే నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం నియోజకవర్గాల్లోని ఆరేడు మండలాల నుంచి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెంకొత్త వీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాల నుంచి నిత్యం నాలుగు వందలకు పైగా ఔట్ పేషెంట్లు వస్తుంటారు. వంద మంది వరకు ఇన్ పేషెంట్లు ఉంటారు. ఆపరేషన్ థియేటర్‌తో పాటు పలు వార్డులకు సెంట్రల్ ఆక్సిజన్ ఏర్పాటు ఉంది. ఇప్పుడు అదనపు సదుపాయంగా లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధమవుతోంది.

నిర్మాణం చేపడుతున్న ఆక్సిజన్ ప్లాంట్ ఇదే..

ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ఆదివారం ముగిసాయి. మూడు రోజులపాటు జరిగిన హాకీ క్రీడా పోటీల్లో బాలురు విభాగంలో కడప మొదటి స్థానం లోను, నెల్లూరు ద్వితీయ స్థానంలోను, విశాఖపట్నం తృతీయ స్థానంలోనూ నిలిచాయి. బాలికల విభాగంలో తూర్పు గోదావరి ప్రథమ స్థానంలోనూ, కడప ద్వితీయ స్థానంలోనూ, ప్రకాశం తృతీయ స్థానంలోనూ నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే బాబురావు బహుమతులను అందజేస్తారు. క్రీడాకారులను అభినందించారు. రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు నక్కపల్లిలో జరగడం చాలా సంతోషకరమన్నారు. క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏనుగుపల్లి రత్నం, జెడ్పిటిసి గోసల కాసులమ్మ, సర్పంచ్ నేతల జయరత్న కుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, వెలగ ఈశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాంబాబు, రాష్ట్ర పరిశీలకులు శ్యామల, ఉప సర్పంచ్ వీసం రాజు, బియస్ హాకీ ఫౌండర్ సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, హైస్కూల్ చైర్మన్ కర్రి పద్మ, వైసిపి నాయకులు పాపారావు శేషరత్నం, నరసింహమూర్తి, తాతబాబు, దుర్గ ప్రసాద్, నానాజీ, రామచంద్రరావు, ప్రసాద్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

అనధికారిక లేఅవుట్లు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో ఎండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నర్సీపట్నం- పోలవరం ప్రధాన రహదారికి అనుకొని జోరుగా అక్రమ లేఔట్లు వెలుస్తున్నాయి. ఇటు పంచాయతీ, అటు మండల స్థాయి అధికారులు పట్టించుకోక పోవడంతో ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా లే ఔట్లు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక నాయకుల అండదండలతో అనుమతి లేకుండా గ్రావెల్ అక్రమంగా తరలిస్తూ లే అవుట్లు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. అన్నవరం జంక్షన్ సమీపంలో ఇటీవల ఒక లేఅవుట్ పూర్తి కాగా కొద్ది రోజుల నుండి మరో లేఔట్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి సతీష్‌ను వివరణ కోరగా పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి ఇంకా మంజూరు చేయలేదని, వారికి నోటీసులు అందజేశామని త్వరలో అక్రమ లే అవుట్ల ఏర్పాటు పై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇదిలా ఉండగా గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న రెవెన్యూ అధికారులు ఎవరు పట్టించుకోకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన లేఔట్ కు గడిచిన నాలుగు నెలలుగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారులు ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా లేఅవుట్‌ల కారణంగా సమీప ప్రాంతంలో నిర్మాణదారులు ఆందోళన సైతం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో గల ఇళ్ళ కంటే లేఅవుట్ ఎత్తుగా గ్రావెల్ నింపి ఏర్పాటు చేయడంతో భవిష్యత్తులో ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, అదేవిధంగా పారిశుధ్యం తదితర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు పట్టించుకుని అక్రమ లే అవుట్లను నిలిపి వేయాలని కోరుతున్నారు.

నర్సీపట్నం - పోలవరం ప్రధాన రహదారి సమీపాన లే అవుట్

రోడ్లపైనే మురుగు నీరు

కానరాని డ్రెయినేజీల నిర్మాణం

చోడువాడలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

ప్రజాశక్తి-కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న సమస్యలు పట్టించుకునే విషయంలో అధికారుల్లో స్పందన కరువైంది. నాయకులు సైతం పట్టించుకోక పోవడంతోట గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టక పోవడంతో అధికారులు, నాయకుల తీరు పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదీ మండలంలో పలు గ్రామాల్లో దుస్థితి.

మండలంలోని ఎండపల్లి, చౌడువాడ గ్రామాల ప్రధాన రహదారిలో నిత్యం మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకునే నాధుడే కరమయ్యారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో మురికి నీరు కారణంగా వాహనాలు జారి పడిపోతున్నాయి. అధికారులు, నాయకులు నిత్యం ఆయా ప్రాంతాల్లో రాక పోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా ప్రాంతాలలో మురికినీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎండపల్లిలో రోడ్డుపై మురుగునీరు